పత్రికాప్రకటన తేది: 06-02-2007

# 'పల్లెబాట' కాదు ... పంచాయతీలకు 'డొల్లబాట'

పటిష్టమైన రెవెన్యూ వ్యవస్థ అవసరాన్ని ఎవరూ కాదనరు. అంతకు మించి ప్రజలకు మెరుగైన సేవలు అందించగల పటిష్టమైన గ్రామ పంచాయతీ వ్యవస్థ వుండి తీరాలి. ఈ రెండింటికీ మధ్య ఎలాంటి వైరుధ్యమూ లేదు. ఎవరి విధులు వారికి అప్పగిస్తే ఎవరూ తప్పుపట్టరు. కాని ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థ పటిష్టత పేరుతో పంచాయతీలను నిర్వీర్యం చేస్తున్నది. పేరుగొప్ప ఊరు దిబ్బ అన్నట్టుగా " పల్లెబాట" మోత మోగిస్తున్న ప్రభుత్వం గ్రామాలను "డొల్లబాట" పట్టిస్తున్నది. రాజ్యాంగం సూచించిన 29 అంశాలకు సంబంధించిన విధులను పంచాయతీల పరిధిలో వుంచడానికి బదులు వాటిని రెవెన్యూ శాఖకు బదలాయించడం రాజ్యాంగ స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధం. రాజ్యాంగ సవరణ జరిగి పుష్కరం దాటినా స్థానిక ప్రభుత్వాలకు అధికారాల బదలాయింపు మాత్రం రాష్ట్ర ప్రభుత్వం గడపదాటక పోవడం పూర్తిగా రాజ్యాంగ ఉల్లంఘన తప్ప వేరు కాదు. రాజీవ్ పేరు అనునిత్యం స్మరించే ప్రభుత్వం రాజీవ్ పేరుమీదుగా జరిగిన రాజ్యాంగ సవరణని పూర్తిగా తుంగలో తొక్కుతున్నది. పంచాయతీ ఎన్నికలకు ముందు వాటికి అధికారాలు బదలాయిస్తామని కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రితో 2006 ఏప్రిల్ 21న ఒక అవగాహనా పత్రాన్ని రాసి ఇచ్చిన ఈ ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలు జరిగి 6 నెలలు దాటినా దాని ఊసు ఎత్తటం లేదు. ఏరు దాటాకా తెప్ప తగలేసే చందంగా వ్యవహరిస్తున్నది. స్థానిక ప్రభుత్వాల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న రాజ్యాంగ వ్యతిరేక వైఖరిని విడనాడాలని లోక్‌సత్తా పార్టీ విజ్ఞప్తి చేస్తున్నది.

పన్నులు కట్టే ప్రజలు నివసించే చోట కనీస వసతులు కల్పించడానికి, పాఠశాల విద్యనీ, వైద్యసేవల్ని అందించడానికి తగిన పటిష్టమైన స్థానిక ప్రభుత్వాలు లేకుండా చెయ్యడం కంటే దారుణం మరొకటి వుండదు. గ్రామాల ప్రజలు ప్రతి పనికీ యాచకులుగా జాతీయ రాష్ట్ర ప్రభుత్వాలను అర్థించే దుస్థితి కొనసాగకూడదని లోక్‌సత్తా పార్టీ భావిస్తున్నది. ఇది 70 శాతం గ్రామీణ ప్రజల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న అనుచిత వైఖరిగా లోక్‌సత్తా పార్టీ స్పష్టం చేస్తున్నది.

**లోక్‌సత్తా పార్టీ తక్షణం ఈ క్రింది చర్యలు తీసుకోవలసిందింగా కోరుతున్నది.**

1. రాజ్యాంగబద్ధంగా గ్రామపంచాయతీల పరిధిలోకి వచ్చే అంశాలకు సంబంధించిన అన్ని విధులను అక్కడే వుంచాలి.
2. పంచాయితీలకు, మున్సిపాలిటీలకు రాజ్యాంగబద్ధంగా దఖలు పర్చాల్సిన విధులు, నిధులు సిబ్బందిని వెంటనే బదలాయించాలి.
3. రాబోయే బడ్జెట్‌లో జిల్లాలవారీగా బడ్జెట్ కేటాయింపులు చేసి స్థానిక ప్రభుత్వాలకు న్యాయమైన వాటా ఇవ్వాలి.
4. రెవెన్యూ శాఖ పరిధిలోకి వచ్చే మిగిలిన విధులను ఆ శాఖకు బదలాయించి దానిని పటిష్టం చేయాలి.
5. తక్షణమే భూసర్వేను చేపట్టి భూరికార్డులను కంప్యూటరీకరించాలి. అమ్మకాలు, కొనుగోళ్ళు విభజనల ఆధారంగా కొత్త పాసు పుస్తకాలు జారీ చెయ్యాలి.
6. రెవెన్యూశాఖను, భూరిజిస్ట్రేషన్ శాఖను కిందిస్థాయిలో అనుసంధానం చేసి భూరికార్డుల సమన్వయాన్ని సాధించాలి.

**(డి.వి.వి.యస్ వర్మ)**
లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యదర్శి